క్లుప్తంగా

ఏపీసీసీ ఉపాధ్యక్షుడిగా కొత్తూరి

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొత్తూరి శ్రీను ఏపీసీసీ ఉపాధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి..గతంలో ఈయన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కమిటీలో పలు పదవులు నిర్వహించారు. అమలాపురానికి చెందిన ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు శ్రీను అత్యంత సన్నిహితుడు. శ్రీను నియామకానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

యోగా గురువు భైరవస్వామికి సత్కారం



భైరవస్వామిని సత్కరిస్తున్న శ్రీమన్నారాయణరావు, అనంతలక్ష్మి దంపతులు

అమలాపురం టౌన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక వడ్డిగూడెంలోని శ్రేయ దివ్యాంగుల పాఠశాలలో సోమవారం ఘనంగా జరిగింది. పాఠశాల వ్యవస్థాపకుడు, రాష్ట్ర సక్షమ్ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన 90 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, యోగా గురువు మోటూరి భైరవస్వామిని ఘనంగా సత్కరించారు. అలాగే దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొర్లపాటి దశరధరామయ్య, పాఠశాల అధ్యాపకులు, శిక్షకులు డాక్టర్ నాజర్ షేక్, తులసి, ఉమాదేవి, లక్ష్మీదేవి, సదాలక్ష్మి, కృష్ణకుమారి, నాగలక్ష్మి, రేణుక, ప్రభ, లక్ష్మిని కూడా సత్కరించారు. డాక్టర్ శ్రీమన్నారాయణరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉపాధ్యాయుడి రీతితో తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం డాక్టర్ శ్రీమన్నారాయణరావు, డాక్టర్ అనంతలక్ష్మి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, విశ్రాంత బ్యాంక్ అధికారి పేరి లక్ష్మీనరసింహం, నిర్వాహకులు సుమ, సరస్వతి, సత్య, శ్రీగౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: పౌర సరఫరాల శాఖలో రబీ సీజన్ రెండు నెలల కాల పరిమితిలో ఆర్‌బీకేల్లో పనిచేసిన పీపీసీ ఉద్యోగులకు జీతాలు రాలేదని కలెక్టరేట్ వద్ద సోమవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. టీఏలు, డీఈఓ, హెల్పర్‌గా ఆర్‌బీకేల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా రబీ సీజన్‌లో ఏప్రిల్, మే నెలల్లో ధాన్యం కొనుగోళ్లకు పని చేశామని తెలిపారు. మూడు నెలలైనా తమకు ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వారు వినతిపత్రం అందించారు. జీతాలు తక్షణమే ఇవ్వాలని వారు కోరారు. టీఏకు రూ.15 వేలు, డీఈఓ రూ.12 వేలు, హెల్పర్‌కు రూ.9 వేలు తక్షణ విడుదల చేయాలని కోరారు.

వరద బాధితులకు సాయం

యానాం: విజయవాడలో వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన బాధితుల కోసం సోమవారం యానాం రైస్‌మిల్ వర్కర్లు నగదు సాయాన్ని అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వర్కర్లు సేకరించిన నగదును కన్వీనర్ కె.సత్యనారాయణ, ఇళ్ల వాసుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరద బాధితులకు వర్కర్లు సాయం అందించడం అభినందనీయమన్నారు.

చెరువు కాదు.. స్కూలు గ్రౌండే..!




ముంపు నీటిలో నానుతున్న జెడ్పీ స్కూళ్ల క్రీడా స్థలం, బాస్కెట్ బాల్ కోర్టులు

అమలాపురం టౌన్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అమలాపురం జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల క్రీడా స్థలం ముంపు నీటిలో చిక్కుకుంది. ఆ క్రీడా స్థలంలో ఉన్న రెండు బాస్కెట్ బాల్ కోర్టులు పూర్తిగా జల దిగ్బంధంలో ఉన్నాయి. పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానం.. బాస్కెట్ బాల్ క్రీడకు పెట్టింది పేరు. ఈ కోర్టుల్లో శిక్షణ పొంది ఎందరో క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించారు. స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న క్రీడా మైదానంలోని బాస్కెట్ బాల్ కోర్టుల్లో రోజూ దాదాపు 150 మంది విద్యార్థులు, క్రీడాకారులు బ్యాచ్‌లుగా శిక్షణ పొందుతున్నారు. వర్షాల వల్ల రెండు కోర్టులు జల దిగ్బంధంలో ఉండడంతో, బాస్కెట్ బాల్ ప్రాక్టీస్ చేయలేకపోతున్నారు. దాదాపు ఆరు ఎకరాల క్రీడా స్థలంలో ఉన్న వాకింగ్ ట్రాక్ కూడా ముంపు నీటిలోనే ఉంది. వారం రోజులుగా వాకర్స్ కూడా రావడం లేదు. మైదానంలోని ముంపు నీటిని తక్షణం తొలగించాలని మున్సిపల్ అధికారులను క్రీడాకారులు, విద్యార్థులు, వాకర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

గట్టెక్కించిన వంతెన

- వరద విపత్తు నుంచి విముక్తి
- లంక కుగ్రామాల కష్టాలు తీర్చిన వైఎస్సార్ వారధి
- పడవలను ఆశ్రయించే పరిస్థితి లేదిక..
- గ్రామాల్లో సమృద్ధిగా మౌలిక వసతుల కల్పన
- పుష్కలంగా రవాణా నదుపాయాలు



వైఎస్సార్ వారధి

ఐ.పోలవరం: గోదావరికి ఏటా వరదలు రావడం.. లంక గ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడడం సర్వ సాధారణంగా మారింది. వరదలను ఆపలేకపోయినా, వరద విపత్తు నుంచి గట్టెక్కేలా చేయడం పాలకులకు అసాధ్యమైతే కాదు. ఈ క్రమంలోనే మండల పరిధిలో నిర్మించిన వైఎస్సార్ వారధి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని.. నాలుగు మండలాల్లో /పదకొండు లంక కుగ్రామాల ప్రజానీకానికి వరంలా మారింది. ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు, వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఈ వారధి ఎంతగానో ఉపయోగపడుతోంది.

గతంలో పడవలే దిక్కు

ముమ్మిడివరం నియోజకవర్గంలో గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల మధ్య దీవిగా ఉన్న 11 గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మందికి బాహ్య ప్రపంచంతో ప్రత్యక్ష సంబంధాలు లేకుండా ఉండేవి. లంక వాసులు రాకపోకలు సాగించాలంటే పడవలే గత్యంతరం. సముద్రానికి సమీపంలో ఉన్నందున బ్యాక్ వాటర్ కారణంగా వేసవిలో సైతం నదీపాయల్లో నీరు ఉండేది. దీంతో నిరంతరం పడవలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ దీవికి వంతెన నిర్మించాలని స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అయితే పంచాయతీరాజ్ శాఖ రూ.35 కోట్లతో పశువుల్లంక-సలాదివారిపాలెం వంతెన నిర్మాణం పూర్తి చేసింది. గత ప్రభుత్వ హయాంలో వేగంగా పనులు నిర్వహించడంతో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దీనిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

లబ్ధి చేకూరిన గ్రామాలివే..

ముమ్మిడివరం మండలం కమిని, వలసలతిప్ప, సలాదివారిపాలెం, పొట్టితిప్ప, తాళ్లరేవు మండలం పిల్లంక శివారు, కొత్తలంక, ఐ.పోలవరం పశువుల్లంక శివారు, చింతపల్లిలంక, కె.గంగవరం మండలం శేరులంక, సీతారామపురం, చినపేట.

వరద విపత్తుల నుంచి..

వారధి అందుబాటులో లేని సమయంలో ఆయా గ్రామాల్లో కనీస వసతులు ఉండేవి కావు. గోదావరికి వరదలు వస్తే ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసేవారు. రోగం బారిన పడినా, ప్రాణాల మీదకు వచ్చినా, శుభ కార్యక్రమాలకు వెళ్లాలన్నా అక్కడి వారికి రవాణా సాధనం నాటు పడవే. పడవ ప్రమాదాల్లో స్థానికులు పెద్దఎత్తున మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి.

వారధి నిర్మించాక..

ఇక్కడ వారధి కట్టాక ఆయా గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ఇక్కడ వంతెనను సుమారు 352 మీటర్ల పొడవున, 25 అడుగుల వెడల్పున నిర్మించారు. వరదల సమయంలో ముంపు బాధితులు ఇతర ప్రాంతాలకు వేగంగా వెళ్లగలుగుతున్నారు. మహిళలు, విద్యార్థులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు ఏర్పడ్డాయి.

అందరికీ ప్రయోజనకరం



ఈ వంతెన నిర్మాణంతో నదీపాయల మధ్య ఉన్న 11 గ్రామాల్లోని పది వేల మందికి ప్రయోజనం చేకూరుతోంది. రవాణా సౌకర్యాలు ఏర్పడటంతో పాటు, లంక గ్రామాల్లో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– సలాది సాయిగురువు, సలాదివారిపాలెం

ప్రమాదాల బారి నుంచి..



ఈ వంతెన నిర్మాణానికి ముందు పలు పడవ ప్రమాదాలు జరిగాయి. చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వరదల సమయాల్లో రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ఇప్పుడు ఈ వంతెన ఏర్పాటు చేయడం వలన అభివృద్ధికి బాటలు పడ్డాయి. లంక ప్రాంతాల్లో ఉండే భూముల ధరలు కూడా భారీగా పెరిగాయి.

– గెద్దం శేఖర్, మాజీ సర్పంచ్, కమిని

ముఖ్యంగా రైతులు పండించే వ్యవసాయ, ఉద్యాన పంటలను నేరుగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పడవల మీద తరలించాల్సిన అవసరం లేనందున మంచి ధర దొరుకుతోందని రైతులు చెబుతున్నారు. లంకల్లో ఇళ్ల నిర్మాణాలకు స్థానికులు అష్టకష్టాలు పడేవారు. సిమెంట్, ఐరెన్, కాంక్రీట్ వంటి వస్తువులను పడవల మీద తెచ్చేవారు. ఇప్పుడు నేరుగా లారీలు, మినీ వ్యాన్లు, ట్రాక్టర్ల మీద గ్రామాలకు చేరవేస్తున్నారు. అంబులెన్స్‌లు, ఇతర వాహనాల సౌకర్యం పెరగడం వల్ల రోగాల బారిన పడినా, పెద్దగా ఆందోళన లేదని స్థానికులు చెబుతున్నారు.

చలువ పందిళ్లలో నిత్యాన్నదానాలు

అమలాపురం టౌన్: పట్టణంలోని గడియారం స్తంభం సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, ముమ్మిడివరం గేటు సెంటరులోని సరాబుల చలువ పందిళ్లలో నిత్యాన్నదానాలు జరిగాయి. నవరాత్రుల నిర్వహణలో భాగంగా రోజూ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా చలువ పందిళ్లలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. షరాబులు చలువ పందిరిని నిర్వహిస్తున్న బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ తదితరులు భక్తులకు సేవలందించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లోని చలువ పందిరిలో కూడా చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

అమలాపురం టౌన్: విద్యార్థుల మధ్య తలెత్తుతున్న సంఘర్షణ సమస్యలను పరిష్కరించకుండా, వర్గాలను ప్రోత్సహించి రెచ్చగొడుతున్న రాజోలు శ్రీచైతన్య కళాశాల గుర్తింపు రద్దు చేసి, సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, జిల్లా కన్వీనర్ సాపే రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సంయుక్తంగా అమలాపురంలో సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాల ఏటపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కళాశాలలో విద్యార్థులు రెండు వర్గాలుగా చీలి, ఘర్షణకు దిగడం బాధకరమని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రగతి వెలుగుల్లేని 'చీకట్ల'పాలెం

- 16 ఏళ్లుగా లేని మౌలిక వసతులు
- గ్రామంలోని ఇందిరమ్మ కాలనీవాసుల ఆవేదన



కలెక్టరేట్ వద్ద చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీవాసులు

అమలాపురం రూరల్: మా కాలనీ ఏర్పడి 16 ఏళ్లయింది. ఇప్పటివరకు కాలనీకి రాకపోకలు సాగించేందుకు సరైన మార్గం లేదు, రోడ్డు, డ్రైనేజీలు, కుళాయిలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదంటూ ఉప్పలగుప్తం శివారు చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిపాటి వర్షం కురిసిందంటే చుట్టుపక్కల రైతుల పొలాల్లోని బురద నీటిలో నడుస్తూ ఇళ్లకు చేరుకోవాలన్నారు. తమ కాలనీలో మహిళలు, పాఠశాల విద్యార్థులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలనా, రావాలన్నా నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. 2007లో ప్రభుత్వం ఇందిరమ్మ గ్రామంగా ఏంపీక చేసి, నివాస స్థలాల్లేని 35 మంది నిరు పేదలకు గ్రామంలో సర్వే నంబర్ 361/9,10,11లో 1.08 ఎకరాలను కొనుగోలు చేసి, ఒక్కొక్క లబ్ధిదారుకు రెండు సెంట్ల చొప్పున లేఅవుట్ వేసి పట్టాలిచ్చిందన్నారు. అందులో కొందరు పక్కా గృహాలు, మరికొందరు పూరిళ్లు వేసుకుని నివసిస్తున్నారని చెప్పారు. సుమారు 16 ఏళ్లయినా ఇప్పటివరకు ప్రభుత్వం ఈ కాలనీకి దారి ఇవ్వలేదన్నారు. ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్ట లేదన్నారు. రోడ్లు, తాగునీరు లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీకి రోడ్డు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు.

నిర్లక్ష్యంతోనే వరద ముప్పే

- ముందస్తు హెచ్చరికలు వదిలి, చంద్రబాబు ప్రచార ఆర్భాటంతోనే సరి
- విజయవాడ వరద అలక్ష్యంపై మాజీ మంత్రి విశ్వరూప్ ధ్వజం



అమలాపురం టౌన్: ప్రకృతి వైపరీత్యాలు ఏ రూపంలో వస్తున్నా, అవి తెచ్చిపెట్టే కష్టనష్టాలను వాతావరణ శాఖ, నీటి పారుదల శాఖ ముందస్తు హెచ్చరికలు ప్రభుత్వానికి అందించడం, తద్వారా ప్రజలను మేలు కొల్పడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చకచకా జరిగి తీరాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ అన్నారు. అయితే విజయవాడలో సంభవించిన వరద, ముంపు తీవ్రత ప్రభుత్వానికి ముందే తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించి, ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయకుండా, అంతటి భారీ ఆస్తి, ప్రాణనష్టాలకు కారణమైందని ధ్వజమెత్తారు. ఆయన 'సాక్షి'తో సోమవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో తొలి నుంచి ప్రచార ఆర్భాటానికి పాకులాడే సీఎం చంద్రబాబు.. ఈ వరదల సమయంలో కూడా అదే యావతో రోజంతా పనిచేస్తున్నట్టు నటిస్తున్నారని విమర్శించారు. రోజుకు నాలుగైదు ప్రెస్‌మీట్లు పెట్టి, అంతా తానే చేస్తున్నట్టు భ్రమలు కల్పించేలా చంద్రబాబు బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. విజయవాడకు వరద విపత్తును సమర్థంగా ఎదుర్కోవడంలో, బాధితులను అప్రమత్తం చేయడంతో, కనీస అవసరాలు తీర్చడంలో, పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టం చేశారు. విజయవాడ నగరం, పరిసర గ్రామాల్లో అపార్ట్‌మెంట్లు అధికంగా ఉన్న దృష్ట్యా, కనీసం ముందు అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్లలో ఉన్న కుటుంబాలనైనా ఖాళీ చేయించి ఉంటే నష్టం ఇంత తీవ్రంగా ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. సీఎం చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా, రాధాకృష్ణ యాక్టివ్ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడలోకి విడిచిపెట్టారని ఆరోపించారు. వరదలు ప్రజలను పూర్తిగా ముంచెత్తిన తర్వాత ప్రాణ రక్షణ కోసం చాలా మంది బాధితులు ఇళ్ల నుంచి ముంపు నీటిలోనే అతి కష్టంగా నడిచివచ్చి, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే ప్రయత్నంలోనే దాదాపు 50 మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది బాధితులకు పూర్తి స్థాయిలో బోటు సౌకర్యం కూడా కల్పించలేకపోయారన్నారు. కనీసం చిన్న పిల్లల ఆకలి తీర్చేందుకు పాలను కూడా ప్రభుత్వం అందించలేక పోయిందని ప్రభుత్వ తీరుపై ఆయన మండి పడ్డారు. ఎనిమిది రోజుల పాటు లక్షల మంది ముంపు బాధితులు నరకయాతన అనుభవించారంటే, రాష్ట్ర రాజధాని అని చెప్పుకునే విజయవాడ నగరానికే ఇలాంటి దుస్థితి తలెత్తిందా అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక పలు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో, ఏజెన్సీల్లో ఇలాంటి విపత్తులు సంభవిస్తే చేతులెత్తేసినట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరించేదేమోనని సందేహం వెలిబుచ్చారు.

ఎంబీబీఎస్‌కు నవోదయ విద్యార్థుల ఎంపిక



బాలాజీ లాస్య



ఎల్.సాయినాయుడు



ఎస్.విజ్ఞానశ్రీ



ఎం.శివకాశీ

యానాం: జవహర్ నవోదయ విద్యాలయ(యానాం)కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సుకు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యాలయ నుంచి నలుగురు విద్యార్థులు ఎల్.సాయినాయుడు, ఎం.శివకాశీ, బాలాజీలాస్య, ఎస్ విజ్ఞానశ్రీ పుదుచ్చేరిలో ప్రతిష్ఠాత్మక ఇందిరాగాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు పొందారన్నారు. అదేవిధంగా ఐఐటీ ఖరగ్పూర్‌లో ఆకాష్ సీటు సాధించారని, సహీతా ఏంజిల్ దక్షిణా కోర్సుకు ఎంపిక కాగా, సాయి ప్రణీత్, అమృత వర్షిణి రెండేళ్ల ఐఐటీ కోచింగ్ (అవంతి కోర్సు)కు ఎంపికైనట్టు వివరించారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు మోహనకృష్ణ, మనోజ్ఞ ఎంపికయ్యారన్నారు. యానాం నవోదయ అకడమిక్ ఎక్సలెన్సీలో 2023-24, 24-25 విద్యా సంవత్సరాల్లో హైదరాబాద్ రీజియన్‌లో అగ్ర స్థానంలో ఉందని తెలిపారు. పీఎంశ్రీలో భాగంగా ఈ ఏడాది అన్ని తరగతులు డిజిటలైజేషన్ చేస్తున్నట్టు చెప్పారు.

బాధితుడికి ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ

తాళ్లరేవు: జార్జిపేటలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు ఇంధన సూర్యనారాయణ కుటుంబానికి జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ కేవీ రమణ



కాలేజీ టాపర్ అనన్యకు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం ఇస్తున్న వైస్ చాన్సలర్ రమణ, సీజీఎం భాస్కరరావు

అల్లవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు కాలానుగుణంగా వచ్చే సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత ఉద్యోగ లక్ష్యాలను చేరుకోవాలని జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ కేవీ రమణ అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన గ్రాడ్యుయేషన్ డే సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా కేవీ రమణ, కాకినాడ ఓఎన్జీసీ సీజీఎం జి.భాస్కరరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు చిన్న ఉద్యోగాలకు పరిమితం కాకూడదని, స్టార్టప్‌లు ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలన్నారు. దేశానికి, సొసైటీకి ఉపయోగపడేలా సిద్ధం కావాలన్నారు. బీవీసీ చైర్మన్ బోనం వెంకటసతీష్ మాట్లాడుతూ 2020-24 విద్యా సంవత్సరంలో బీటెక్ నుంచి 588 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను సాధించారని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించారు. కాలేజీ టాపర్‌గా అనన్య నిలిచింది. కార్యక్రమంలో బీవీసీ గవర్నింగ్ బాడీ మెంబర్ బోనం కనకదుర్గ, బోనం కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, బీవీసీఆర్ ప్రిన్సిపాల్ టీవీ జనార్దనరావు, బీవీసీఐటీ ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, ఏఓ ప్రసాద్ పాల్గొన్నారు.

దర్యాప్తులో తాత్సారం తగదు

కోల్‌కతా ఘటనపై మహిళా వైద్యుల నిరసన



అమలాపురంలో నిరసన తెలుపుతున్న మహిళా వైద్యులు, పీజీ వైద్యులు

అమలాపురం టౌన్: కోల్‌కతాలో ఓ మహిళా వైద్యురాలిపై పాశవిక హత్యాచార ఘటన కేసు దర్యాప్తులో తాత్సారం తగదని ఆలిండియా గైనకాలిజిస్ట్స్ అండ్ అబ్‌స్టెట్రీషన్స్ అసోసియేషన్ (ఏఐసీఓజీ) అమలాపురం శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వెంపరాల శారద అన్నారు. ఇదే డిమాండ్‌పై స్థానిక గడియారం స్తంభం సెంటరులో కోనసీమకు చెందిన మహిళా వైద్యులు సోమవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, దోషులకు తక్షణమే కఠిన శిక్షలు పడేలా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా వైద్యులు ముఖ్యంగా రాత్రి సమయాల్లో పనిచేసే ఆస్పత్రుల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని నినాదాలు చేశారు. వీరి నిరసనకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా మహిళా వైద్యుల విభాగం అధ్యక్షుడు డాక్టర్ వి.గిరజాకుమారి ఆధ్వర్యంలో మహిళా వైద్యులు, కిమ్స్ వైద్య కళాశాల పీజీ మహిళా వైద్యులు సంఘీభావంగా నిలిచారు. ఈ నిరసనలో మహిళా వైద్యులతో పాటు, ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు. మహిళా వైద్యులు, నర్సులకు రక్షణ కల్పించాలన్న నినాదాలతో కూడిన ఫ్ల కార్డులు చేతపట్టి వారు ఆందోళనలో పాల్గొన్నారు. ఏఐసీఓజీ, ఐఎంఏలకు చెందిన మహిళా వైద్యులు ఏ.రాధిక, మాధవి, స్మిత, స్రవంతి, భానుమతి, శ్రీవిద్య, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అందించాలి

ఉప్పలగుప్తం: నారుమడులకు పెట్టుబడులు పెట్టి, భారీ వర్షాలకు అవి నీట మునగటంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం పంట నష్టం అందించాలని మండలంలోని వానపల్లిపాలెం గ్రామానికి చెందిన రైతులు సోమవారం మండల స్థాయి పరిష్కార వేదికలో ఏఓ కుమార్‌బాబుకు వినతి పత్రం అందించారు. నాట్లు వేసిన రైతులకు మాత్రమే ఈ-క్రాప్ చేసి, పంట నష్టం నమోదు చేస్తున్నారని, నారుమడులు వేసిన రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారని వివరించారు. వారికి ఈ-క్రాప్ నమోదు చేసి పంట నష్టం అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు చిక్కం పెద్దబ్బులు, జొన్నగంటి రామకృష్ణారావు, చిక్కం వెంకటరమణ, యాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి క్షణం.. మధుర వీక్షణం

మనిషికి భగవంతుడు ప్రసాదించిన అద్భుత వరం జీవితం. సుఖం విలువ తెలియాలంటే.. ముందుగా కష్టం విలువ తెలిసుండాలి. జీవితంలో ఎదురైన కొద్దిపాటి కష్టాలకే.. బతుకును కడతేర్చుకోవాలనుకుంటే అది అవివేకమే అవుతుంది. చీకట్లోనే వెలుగు దాగున్నట్టు.. కష్టం వెనువెంటే ఆనందాలు, విజయాలూ ఉంటాయనేది జగమెరిగిన సత్యం. అందుకే.. జీవితాన్ని సంతోషంగా ఆస్వాదించాలని అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం సందర్భంగా ఈ కథనం.

- బలవన్మరణం కాదు సమస్యకు పరిష్కారం
- నిండు నూరేళ్లూ ఆస్వాదిస్తేనే జీవితం
- క్షణికావేశ నిర్ణయాలతో అయినవారికి మిగిలేది విషాదమే..
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం



యానాం: ఆర్థిక, మానసిక, వ్యక్తిగత ఇలా ఎన్నెన్నో కారణాలతో అనేక మంది ఆకస్మికంగా తనువు చాలిస్తున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న అయినవారికి కడుపు కోతను మిగులుస్తున్నారు.

యానాంలో ఏటా బాలయోగి వారధి పైనుంచి ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య పెరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, యానాం పరిసర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ కొందరు అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. యానాం-ఎదుర్లంక బాలయోగి వంతెన పైనుంచి దూకి, బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య ఏటా 30కి పైగా ఉంటోంది. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలు, ప్రేమ వ్యవహారాలు, నిరాశా నిస్పృహల్లో ఉన్నవారు ఈ ఘాతుకాలకు పాల్పడుతుండడంతో, వీటిని ఎలా అరికట్టాలో తెలియక అధికారులు, పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

పలువురిని కాపాడి..

ఇలాఉండగా బలవన్మరణాలకు పాల్పడుతున్న కొందరిని పోలీసులు, మత్స్యకారులు కాపాడారు. యానాం-ఎదుర్లంక వారధి రెండు పోలీసు స్టేషన్ల పరిధిలో ఉంది. కుడి వైపు కొంతభాగం యానాం పోలీస్‌స్టేషన్ పరిధిలో, ఎడమ వైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోకి వస్తుంది. వంతెనపై నిత్యం యానాం పోలీసులు నిఘా వేస్తున్నారు. రాజీవ్ బీచ్ వద్ద ప్రత్యేక టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటుచేశారు. అక్కడ సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. పర్యాటకుల రక్షణార్థం పోలీస్‌పికెట్‌ను ఏర్పాటు చేశారు. అయినా రాత్రి వేళల్లో బలవన్మరణాలకు పాల్పడేవారు ఎక్కువగా ఉంటున్నారు. చాలా సందర్భాల్లో పోలీసులు, మత్స్యకారులు నావల్లో వెళ్లి వారిని రక్షిస్తున్నారు. ఈ ఘటనలను అరికట్టేందుకు వారధి యానాం వైపు నుంచి ఎదుర్లంక వైపు వరకు 1.80 కి.మీ. మేర ఐరన్ ఫెన్సింగ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై గతంలో ఆర్‌ఏఓ మునిస్వామికి, ఎంపీ వైద్యలింగానికి పలువురు వినతిపత్రాలు సమర్పించారు. నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి పైనుంచి ఎక్కువగా బలవన్మరణాలకు పాల్పడతున్నారు. వీటి నివారణ కోసం రాజీవ్ బీచ్, పరిసర ప్రాంతాల్లో నిత్యం పోలీసు నిఘా కొనసాగుతోంది. దీనితో పలువురిని రక్షిస్తున్నాం. ఎవరైనా బలవన్మరణాలకు పాల్పడే వారిపై అనుమానం వస్తే, వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– శేరు నూకరాజు, ఎస్సై, యానాం